క్లుప్తంగా

11 వరకూ వేసవి శిక్షణ శిబిరాలు

సీతానగరం: విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలను సోమవారం నుంచి ఈనెల 11 వరకు నిర్వహిస్తామని సీతానగరం లైబ్రేరియన్ టి.అరుణ్ కుమార్ శనివారం తెలిపారు. ఇందులో భాగంగా గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదివించడం, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, సంగీతం, డ్యాన్స్, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలపై అవగాహన కల్పిస్తామన్నారు.

428 మందికి వైద్యసేవలు



రఘుదేవపురంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో 428 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్యసేవలు అందించారు. అవసరమైన వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి చికిత్స చేశారు. పీహెచ్‌సీ సూపర్ వైజర్ సుధాకర్, ఏఎన్ఎం అమృత, ఆశావర్కర్లు లలిత, రవళ, వీరమణి, సావిత్రి పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి శిక్షణా తరగతులు

రంగంపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకూ విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ విజ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనమే ఏకైక సాధనమన్నారు. శిక్షణా తరగతుల్లో కథలు చెప్పడం, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, స్పోకెన్ ఇంగ్లిష్, నృత్యం, గణితం నేర్పిస్తారని చెప్పారు. విద్యార్థులు శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

వేంకటేశ్వరస్వామికి చక్రస్నానం



సంపరలో నిర్వహిస్తున్న వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

పెదపూడి: మండలంలోని సంపర వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం స్వామి వారికి చక్రస్నానం చేయించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఉదయం స్వామికి ప్రత్యేక, విశేష పూజలు చేశారు. అనంతరం స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గోకవరంలో భారీ వర్షం

గోకవరం: మండలంలో పలు గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు తన ప్రభావం చూపించగా సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సాయంత్రం 4.30 గంటల నుంచి ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. ఒక్కసారిగా వర్షం కురవడంతో ప్రయాణికులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రోడ్డును ముంచేసిన వాన



రోడ్డుపై తిష్టవేసిన ముంపు నీరు

రాజానగరం: మండలంలో కలవచర్ల నుంచి సీతారామపురం వెళ్లే రోడ్డు శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి మునిగిపోయింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ముంపు నీరు చెరువులోకి వెళ్లే విధంగా వేసిన తూరలు సవ్యంగా లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై ముంపు నీరు తిష్ట వేసింది. ఫలితంగా కలవచర్ల నుంచి సీతారామపురం వెళ్లే రోడ్డులోని కనకదుర్గమ్మ గుడి వద్ద రోడ్డు ఇలా మునిగిపోయింది. తక్షణమే తూరలను సరిచేయడంతో పాటు వాటి సామర్థ్యం పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్‌బీ అధికారులను కలవచర్ల, సీతారామపురం వాసులు కోరుతున్నారు.

బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

సీటీఆర్ఐ: స్థానిక సంస్థల్లో బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సానబోయిన రామారావు అధ్యక్షతన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్లను పునరుద్ధరించాలని, వసతి గృహాల్లో సరైన సదుపాయాలు కల్పించాలన్నారు. జేబీ రాజు మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లు, విద్యాసంస్థలు ఉన్న ప్రదేశాలకు దగ్గరలో ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న ఫుడ్ ప్లాజాను వెంటనే తొలగించాలన్నారు.

పదింతల ఆనందం

- ప్రభుత్వ పాఠశాలల ప్రతిభ
- అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి అభినందనలు



రాజానగరం: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. రాజానగరం మండలంలోని 15 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 840 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, వారిలో 474 మంది (56.43 శాతం) ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 411 మందికి 191 మంది (46.47 శాతం), బాలికలు 429 మందికి 283 మంది (65.97 శాతం) విజయం సాధించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులలో కూడా బాలికలే టాప్‌లో నిలిచారు.

నూరుశాతం ఉత్తీర్ణతలు లేవు

మండలంలోని 15 ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఏఒక్కటీ నూరుశాతం ఫలితాలను అందుకోలేకపోయింది. జి.యర్రంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల 80 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఈ పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 16 మంది ఉత్తీర్ణులయ్యారు. చివరి వరసలో దివాన్ చెరువు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉంది. ఈ పాఠశాల నుంచి 64 మంది పరీక్షలకు హాజరుకాగా 26 మంది (41 శాతం) ఉత్తీర్ణులయ్యారు. చక్రద్వారబంధం, పాలచర్ల 68 శాతం, నరేంద్రపురం, పల్లకడియం 67 శాతం, సంపత్‌నగరం 59 శాతం, కలవచర్ల, లాలాచెరువు 58 శాతం, పుణ్యక్షేత్రం, రాజానగరం, కానవరం 53 శాతం, పాతతుంగపాడు, శ్రీకృష్ణపట్నం 52 శాతం, తోకాడ 50 శాతంతో తమ ఉనికిని చాటుకున్నాయి.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండలంలోని ఏడు ప్రభుత్వ హైస్కూల్లో 445 మంది విద్యార్థులకు 250 మంది (56 శాతం) ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో కె స్వామినాయక్ శనివారం తెలిపారు. బాలురు 207 మందికి 119 మంది, బాలికలు 238 మందికి 131 మంది పాసయ్యారన్నారు. సీతానగరం హైస్కూల్లో 58 శాతం, వంగలపూడి 45, చినకొండేపూడి 57, వెదుళ్లపల్లి 53, బొబ్బిల్లంక 56, మిర్తిపాడు 53, రఘుదేవపురం 69 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: కోరుకొండ మండలం విద్యార్థులు 60 శాతం ఉత్తీర్ణతను సాధించారు. 24 పాఠశాలల నుంచి 1,015 మంది పరీక్షలు రాయగా, వారిలో 610 మంది ఉత్తీర్ణులయ్యారు.

పదిలో మెరిసిన ప్రభుత్వ విద్యార్థులు

అనపర్తి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అనపర్తి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభతో మెరుగైన ఫలితాలు సాధించి సత్తా చాటారు. అనపర్తి మండలంలో 71 ఉత్తీర్ణతా శాతం నమోదైంది. మొత్తంగా 474 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 298 మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈఓ స్వామి నాయక్ తెలిపారు.

పెదపూడి: పెదపూడి మండలంలో 79 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలో 14 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 556 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వారిలో 440 మంది ఉత్తీర్ణత సాధించారు.

రంగంపేట: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రంగంపేట మండలంలో 57 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 565 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 320 మంది ఉత్తీర్ణులయ్యారు.

బిక్కవోలు: బిక్కవోలు మండలంలో పదో తరగతి పరీక్షలకు 643 మంది విద్యార్థులు హాజరుకాగా 403 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా మండలంలో 62 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.

రాష్ట్రంలో తొమ్మిది ప్రాజెక్టులకు రూ.8,600 కోట్లు



పురుషోత్తపట్నం వద్ద గోదావరి పరిసరాలను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజినీర్ గాయత్రీదేవి

సీతానగరం: రాష్ట్రంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.8,600 కోట్లతో తొమ్మిది ప్రాజెక్టులు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజినీర్ టి.గాయత్రీదేవి తెలిపారు. రాజానగరం నియోజకవర్గానికి గోదావరి జలాలను అందించడానికి రూ.215 కోట్లతో చేపట్టే ప్రాజెక్టు నిర్మాణం కోసం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు ఎం.శ్రీనివాస్, డి.బాలశంకర్రావులతో కలిసి పురుషోత్తపట్నం వద్ద గోదావరి ప్రాంతాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్ గాయత్రీదేవి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్దానం, డోన్, పులివెందులలో చేపట్టిన ప్రాజెక్టుల పనులు 80 శాతం పూర్తయ్యాయని, పశ్చిమ, తూర్పు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ప్రాజెక్టులు టెండర్లు పూర్తయ్యి, సర్వే ప్రోగ్రెస్‌లో ఉందన్నారు. ఈ ప్రాజెక్టుల పరిధిలో రూ.13 వేల కోట్లతో 63 వేల వర్కులు మంజూరయ్యాయని, వీటిలో 50 శాతం పనులు ప్రారంభమయ్యాయని, మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయన్నారు. ఈస్టన్, సెంట్రల్ డెల్టాలకు రూ.1,650 కోట్లతో ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతుందన్నారు. రాజానగరం నియోజకవర్గ ప్రజలకు గోదావరి జలాలను తాగునీరుగా అందించడానికి రూ.215 కోట్లతో చేపట్టే ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా ఇన్‌టేక్ వెల్, హెడ్ వర్క్ నిర్మాణం చేపట్టాల్సిన ప్రదేశాలను పరిశీలించామన్నారు. ఆమె వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవికుమార్, జేఈలు అవినాష్, సుబ్బారావు, సతీష్, డిజైన్ నిపుణులు, మెగా ఇంజినీరింగ్ ప్రతినిధులు ఉన్నారు.

ఘనంగా సత్యసాయి వారోత్సవాలు



విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న సేవా దళ్ సభ్యులు

రంగంపేట: రంగంపేట, కోటపాడు, ఈలకొలను గ్రామాల్లోని సత్యసాయి సమాజ సేవా కేంద్రాల్లో సత్యసాయి వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సత్యసాయిబాబా, ఆయన తల్లి ఈశ్వరమ్మ చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో జిల్లా విద్యా విభాగ సమన్వయకర్త ఎల్.శ్రీనివాసరాజు, స్థానిక సబ్ జోన్ కన్వీనర్ మల్రెడ్డి వీర్రాజు, సబ్ జోన్ సమన్వయ కర్తలు కె.భానుమతి, టి.శ్రీనివాసరావు, బాల వికాస్ గురువులు ప్రభావతి, భవాని, ఎల్ఎస్ఎస్ కిరణ్, దుర్గాసాయిరాజు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర

రాజానగరం: గ్రామ దేవత ముత్యాలమ్మ జాతర మహోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. గరగ నృత్యాలతో పాటు వివిధ దేవతా వేషధారణలో ఉన్న కళాకారుల ప్రదర్శన, తీన్‌మార్ డాన్సులు, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు తీర్థమహోత్సవం జరగనుంది. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన 40 ఏళ్ల కాకర్ల త్రిమూర్తులు శనివారం తెల్లవారుజాము 2.30 గంటల సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడు హైదరాబాద్‌లో రెస్టారెంట్ నిర్వహించేవాడు. ఈ నేపథ్యంలో అప్పులు కట్టలేని పరిస్థితి ఏర్పడడంతో హైదరాబాద్ నుంచి తన ఇంటికి వచ్చి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి ఆరోగ్యం విషమంగా ఉందని సమాచారం.

సంస్కృతీ సంప్రదాయాలే మన బలం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సంజీవరావు

రాజానగరం: మనదేశం వివిధ సంస్కృతీ సంప్రదాయాలకు నెలవని, అదే మన బలమని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు, హెచ్ఓడీ డాక్టర్ పీవీబీ సంజీవరావు అన్నారు. గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు అనే అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పరిపూర్ణమైన మానవుడికి తాను అనుసరిస్తున్న జీవన విధానమే సంస్కృతి అన్నారు. జీవన విధానం, విలువలు, సంప్రదాయాలు, విశ్వాసాలు కట్టుబాట్లు, భాష, ఇవన్నీ సంస్కృతిలో అంతర్భాగాలన్నారు. తల్లిదండ్రుల నుంచి ప్రతి వ్యక్తి ఆచారాలు, సంప్రదాయాలు నేర్చుకుంటాడన్నారు. ఈ సందర్భంగా తెలుగు పాటలు, పద్యాలు, మాటలు, వస్త్రధారణ, మున్నగు వాటిపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా ఆర్.బాలవెంకట్, ఎ.దేవీశైలజ, జువెల్ మేరీసాజు వ్యవహరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామచంద్ర, ఎస్ఎస్ఎస్‌పీఓ షేక్ మీరా పాల్గొన్నారు.

గోకవరం మండలంలో 357 మంది విద్యార్థులు ఉత్తీర్ణత

గోకవరం: మండలంలో పదో తరగతి ఫలితాల్లో 357 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలో 9 ప్రభుత్వ పాఠశాలలు, 5 ప్రైవేటు పాఠశాలల్లో మొత్తం 817 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 357 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో 49 శాతం ఉత్తీర్ణులయ్యారు. పరీక్షా ఫలితాలు విడుదల కావడంతో శనివారం గ్రామాల్లో పదవ తరగతి విద్యార్థుల సందడి నెలకొంది. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, ఎంఈఓ బి.గౌరమ్మ తదితరులు అభినందించారు. భూపతిపాలెం గురుకుల పాఠశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు.

హైకోర్టు న్యాయమూర్తి రాక

కంబాలచెరువు: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావును కలెక్టర్ కె.మాధవీలత శనివారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో అధికారిక పర్యటన నిమిత్తం వచ్చిన హైకోర్టు న్యాయమూర్తిని స్థానికంగా బస చేసిన ప్రైవేటు అతిథిగృహం మంజీరాలో కలిశారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



నర్సాపురంలో విద్యుత్ ఉపకేంద్రం శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- నో పవర్‌కట్, నో లోఓల్టేజీయే లక్ష్యం
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: నో పవర్‌కట్ – నో లోఓల్టేజ్ అమలు జరపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలంలో శనివారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. సచివాలయాలు ప్రారంభం, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కణుపూరులో పాస్టర్ల ఆత్మీయ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నర్సాపురంలో రూ.2.88 కోట్లతో నిర్మిస్తున్న విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, మెట్టప్రాంత రైతన్నలకు సరఫరా సక్రమంగా చేయాలనే లక్ష్యంతో 33/11 కేవీ లైన్ ఉపకేంద్రాన్ని నిర్మించనున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో 8 ఉపకేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. 2009 నుంచి 2019 వరకు గత ప్రభుత్వం ఉపకేంద్రాల ఏర్పాటు, విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోలేదన్నారు. అనంతరం నర్సాపురం, కోరుకొండ సచివాలయాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఎంపీపీ ఉల్లి వీరవెంకట సత్యసూర్యకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కోకన్వీనర్ గణేశుల పోసి, సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షుడు కడియాల పాపారావు, ఏపీఈపీడీసీఎల్ డీఈఈ డి.చిట్టిరాజు, ఏఈ మదర్సా, కనస్ట్రక్షన్ శాఖ డీఈఈ రామకృష్ణ, చొంగా శివయ్య పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

జిల్లా కలెక్టర్ మాధవీలత



కొంకుదురు జగనన్న కాలనీలో జరిగిన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని కొంకుదురు, బలభద్రపురం జగనన్న హౌసింగ్ కాలనీలను సందర్శించిన కలెక్టర్ లబ్ధిదారుల ఇంటి గృహప్రవేశాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం నవరత్న పథకాల్లో భాగంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి స్థలం మంజూరు చేస్తోందన్నారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, అధికారులను కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని సూచించారు. మే నెలాఖరు నాటికి నూరు శాతం ఇంటి నిర్మాణాలు ప్రారంభమయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కొంకుదురు లేఅవుట్‌లో 104 మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించగా ఇప్పటికే 100 మంది ఇంటి నిర్మాణాలు ప్రారంభించారని, అదేవిధంగా బలభద్రపురంలో 668 మందికి గాను 340 మంది నిర్మాణాలు చేపట్టారని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కొంకుదురు జగనన్న కాలనీలో సిరిపల్లి వెంకటలక్ష్మి, శ్రీనివాస్ దంపతులు నిర్మించుకున్న ఇంటి గృహప్రవేశ వేడుకల్లో, బలభద్రపురం లేఅవుట్‌లో ఇలపర్తి బాల, గంగారావు దంపతుల ఇంటి శంకుస్థాపన కార్యక్రమాల్లో కలెక్టర్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కొంకుదురు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, కొమరిపాలెం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, హౌసింగ్ డీఈ సీహెచ్ వేణుగోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సుస్థిరత, పరిరక్షణకు వాకథాన్



వాకథాన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్ నారాయణ్

- ఓఎన్జీసీ ఎసెట్ మేనేజర్ అమిత్ నారాయణ్
- నగరంలో ఉత్సాహంగా ర్యాలీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పర్యావరణ సుస్థిరత, పరిరక్షణకు వాకథాన్ నిర్వహిస్తున్నట్టు ఓఎన్జీసీ రాజమండ్రి ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎసెట్ మేనేజర్ అమిత్ నారాయణ్ అన్నారు. దేశాన్ని పర్యావరణ హితంగా తీర్చిదిద్దాలన్న ప్రధాని నరేంద్రమోదీ పిలుపును సాకారం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇంధనం పొదుపుపై ప్రజలను చైతన్యవంతం చేయడానికి ఓఎన్జీసీ ఆధ్వర్యంలో స్థానికంగా ఏర్పాటు చేసిన వాకథాన్‌ను శనివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ప్రకాశం నగర్‌లోని ఓఎన్జీసీ డిస్పెన్సరీ నుంచి ప్రారంభమైన ర్యాలీ రామాలయం సెంటర్, గెయిల్ ఆఫీస్ మీదుగా గోల్ఫ్‌క్లబ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా అమిత్ నారాయణ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం నెట్ జీరో వైపు శక్తి పరిరక్షణ థీమ్‌తో సాక్షం- 2023ని జరుపుకోవడం జరుగుతోందన్నారు. దీనిలో భాగంగా ఓఎన్జీసీ 2030 నాటికి 45 శాతం సంప్రదాయ వనరులను వినియోగించుకుంటుందన్నారు. ముఖ్యంగా సంస్థ ఇంధన వృథాను అరికట్టడం, లీకేజీలను గుర్తించడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోందన్నారు. ర్యాలీలో ఓఎన్జీసీ అధికారులు, ఎస్పీఎఫ్ సిబ్బంది, కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణతో మరింత నైపుణ్యం

ప్రకాశం నగర్: వేసవి క్రీడా శిబిరాల్లో ఇచ్చే శిక్షణతో క్రీడాకారుల్లో నైపుణ్యం మరింత పెరుగుతుందని వక్తలు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, తూర్పు గోదావరి జిల్లా సాకర్ అసోసియేషన్, యునైటెడ్ ఈస్ట్ గోదావరి ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఫుట్‌బాల్, త్రోబాల్, బాక్సింగ్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పీఏ రాజబాబు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆయా క్రీడల్లో నైపుణ్యం సాధించాలన్నారు. జిల్లా స్పోర్ట్ అభివృద్ధి సంస్థ అధికారి శేషగిరిరావు మాట్లాడుతూ జిల్లాలో వేసవి శిక్షణ తరగతుల నిర్వహణకు 50 శిబిరాలను అనుమతించామన్నారు. కార్యక్రమంలో జిల్లా సాకర్ అధ్యక్షుడు సుంకర నాగేంద్ర కిశోర్ పాల్గొన్నారు.

మహిళా కమిటీ గౌరవ సలహాదారుగా వాసిరెడ్డి పద్మ

సీటీఆర్ఐ: మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మను రాజమహేంద్రవరం మహిళా కమిటీకి గౌరవ సలహాదారుగా వ్యవహరించాలని ఉమెన్ కమిటీ కార్యవర్గం కోరింది. మహిళా కమిటీ ఏర్పాటులో కీలక పాత్ర వహించి, సుదీర్ఘకాలం గతంలో పద్మ ఈ కమిటీకి సెక్రటరీగా పనిచేశారు. శనివారం మహిళా కమిటీ నిర్వాహకులతో సమావేశం అయ్యారు. కమిటీ క్రియాశీలకంగా పనిచేయాలని అందుకు తగిన కార్యక్రమాలు రూపొందించాలని ఈ సమావేశంలో చర్చించారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా జక్కంపూడి విజయలక్ష్మి, అధ్యక్షురాలిగా లక్ష్మి శ్రీనివాస్, కార్యదర్శిగా గ్రంధి లలిత, కోశాధికారిగా కె.విజయలక్ష్మిరెడ్డి, వైస్‌ప్రెసిడెంట్లుగా ఎన్నికయ్యారు.

ఈ-శ్రమ్ కార్డులతో కార్మికులకు భరోసా

- దేశంలో ఎక్కడైనా లబ్ధి పొందేలా ప్రణాళిక
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖాధికారులు



ఈ-శ్రమ్ నమోదుతో కార్మికుడి గుర్తింపు కార్డు

సీటీఆర్ఐ: సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కేంద్రం ప్రభుత్వం అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో ఈ-శ్రమ్ పోర్టల్‌ని ప్రవేశ పెట్టింది. ఆధార్ కార్డు తరహాలో దేశంలో ఎక్కడికి వెళ్లినా ప్రయోజనం చేకూరేలా యూఏఎన్ (యూనివర్సిల్ అకౌంట్ నంబర్)తో కూడిన ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి క్షేత్ర స్థాయిలో కార్మిక శాఖాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. నూతనంగా ఏర్పడిన తూర్పు గోదావరి జిల్లాలో అనాధికారికంగా 4 లక్షల మందికి పైగా అసంఘటిత కార్మికులు ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకూ గుర్తించిన 2,53,823 మందికి కార్డులు అందజేశారు. జిల్లాలో కొన్ని యూనియన్ల ఆధ్వర్యంలో ఈ-శ్రమ్ కార్డుల నమోదు కోసం అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. కార్మికులకు కార్డు ప్రయోజనం తెలియచేసి, నమోదు చేసుకోనేలా యూనియన్లు చర్యలు తీసుకుంటున్నాయి. ఒక్క రాజమహేంద్రవరంలోనే సుమారు 15 వేల మంది కార్మికులు ఉన్నారని అంచనా. వారిలో ఇప్పటి వరకూ సుమారు 5 వేల మందికి పైగా ఈ-శ్రమ్ కార్డులు నమోదు చేయించుకున్నారు.

అర్హులు వీరే..

16 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వయసు కలిగి, ఈఎస్ఐ, ఈపీఎఫ్‌కు అవకాశం లేని భవన నిర్మాణ కార్మికులు, వలస కార్మికులు, చిన్న, సన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, మత్స్యకారులు, పశుపోషణలో నిమగ్నమైన వారు, బీడీ రోలింగ్, తోలు కార్మికులు, వడ్రంగి, ఉప్పు కార్మికులు, ఇటుక బట్టీలు, రాతి క్వారీలో కార్మికులు, సామిల్లు, క్షరకులు, కూరగాయలు, పండ్ల విక్రేతలు, వార్తపత్రిక విక్రేతలు, రిక్షా కార్మికులు, ఆటో డ్రైవర్లు, చర్మశుద్ధి కార్మికులు, వీధి వర్తకులు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు అర్హులు.


నమోదు ఇలా..

ఈ పథకానికి రిజిస్ట్రేషన్ చేసుకొనేవారు ఎటువంటి రుసుము చెల్లించనక్కర్లేదు. కార్మికుడి ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నంబరు (ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌తో సహా), బ్యాంకు, ఆధార్ కార్డుతో లింకేజీ కలిగిన ఫోన్ నంబర్ ఉండాలి. సమీప సీఎస్‌సీ సెంటర్లు, పోస్టాఫీసు, గ్రామ/వార్డు సచివాలయాలలో చేస్తారు. కార్మిక శాఖ కార్యాలయాల్లో లేబర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ని ఏర్పాటు చేసి సహాయ సహకారాలు అందిస్తున్నారు.

అనేక లాభాలు

- అసంఘటిత కార్మికులు సామాజిక భద్రతా చట్టం క్రింద సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందుతారు.
- వృత్తి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను అందించడానికి ఉపయోగపడుతుంది.
- ఆర్థిక సహాయం నేరుగా వారి అకౌంట్‌కి జమ చేస్తారు.


నమోదు చేసుకోవాలి



యూఏఎన్ గుర్తింపు కార్డుల కోసం లేబర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశాం. దీనిద్వారా అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డులు ఉచితంగా అందజేస్తాం. కార్మికులు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. అసంఘటిత కార్మికుల సామాజిక భద్రత కోసం, ఆర్థిక సహాయం కోసం ఉపయోగపడుతుంది.

– బీఎస్ఎం వలీ, సహాయ కార్మిక కమిషనర్

యూనియన్ ఆధ్వర్యంలో..



భవన నిర్మాణ కార్మికులకు ఈ -శ్రమ్ కార్డుపై అవగాహన కల్పిస్తున్నాం. మా యూనియన్‌లోని సభ్యులకు ఈ కార్డుల నమోదు తప్పనిసరి చేశాం. ఇప్పటి వరకూ 850 మంది కార్మికులకు ఆన్‌లైన్ చేయించి వారికి కార్డులు అందజేశాం.

– బొజ్జా రామకృష్ణ, గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు